12112024-DIS-06_Layout 1 11/12/2024 2:47 AM Page 1

నమస్తే తెలంగాణ

బీసీలకు టోకరా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని లగచర్ల గ్రామంలో ఫార్మా విలేజ్ భూ సేకరణపై చర్చించేందుకు వెళ్లిన కలెక్టర్, తహశీల్దార్‌పై రైతులు, గ్రామస్థులు దాడి చేయడం దేనిని సూచిస్తున్నది? ఏడాదిలోనే ఒక ప్రభుత్వం ఈ స్థాయిలో ప్రజా విశ్వాసం కోల్పోవడం మన దేశ చరిత్రలో జరిగిన దాఖలాలు లేవు. రైతుభరోసా, రుణమాఫీ వంటి హామీలు అమలు చేయలేకపోవడం, హైడ్రా వంటి తమాషాలు వెరసి కాంగ్రెస్ సర్కార్ అంటేనే అపనమ్మకం ఏర్పడింది. ఇదిలా ఉంటే, బీసీ కులగణన కోసం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరిట చేపట్టిన తంతుకు ప్రజల నుంచి సహకారం లేకపోగా ఎదురుతిరిగి తరిమికొట్టడం పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి తాజా ఉదాహరణ.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ కులగణన చేయించి, ఆ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పెద్దలు ఊరించారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లోనే బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ఊదరగొట్టారు. కానీ, రేవంత్ సర్కారు ఆ దిశగా సరైన అడుగులు వేయకపోవడం, మోసకారి హామీలను తూచ్ చేసేందుకు అష్టవంకర్లు తిరగడం ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వహిస్తున్న సర్వేపై యథావిధిగానే ప్రజల్లో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కులగణనలో ఆస్తి, ఆదాయ వివరాలు దేనికి? రైతుబంధు, రుణమాఫీల్లో కొర్రీలు, కోతలు వేయడం తెలిసిందే. అదే తరహాలో పథకాల లబ్ధిలో కోతలు పెట్టేందుకే అదనపు వివరాలు సేకరిస్తున్నారా? అనేది అతి ముఖ్యమైన సందేహం. అందుకే ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. పలు చోట్ల బాహాటంగానే సర్వేను బహిష్కరిస్తున్నారు. హామీల అమలు చేతకాక కోతలు పెడుతున్నారనే భావన బలంగా నాటుకుపోయింది. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చుడేమో గానీ, ఇదివరకటి ప్రభుత్వం ఇచ్చినవి కూడా ఊడగొట్టేందుకు కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కసరత్తులో ఇదంతా భాగమేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

తమకు మేలు చేస్తుందని నమ్మితేనే ప్రజలు సర్కారు సర్వేకు సహకరిస్తారు. కానీ, ఇక్కడ అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. మేలు చేయడం కోసం కాకుండా మరోసారి వంచించేందుకు సర్కారు సర్వేను చేపట్టిందని భయపడుతున్నారంటేనే విశ్వసనీయత ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఒక్కరోజులో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఓ రికార్డు. రాష్ట్ర జనాభాలో సింహభాగం సగానికి పైగా (51 శాతం) ఉన్నది బీసీలేనని ఆ సర్వే తేల్చిచెప్పింది. ఇంగ్లండ్‌లో జరిగిన చరిత్రాత్మకమైన 'డోమ్స్ డే' సర్వేతో దానిని విశ్లేషకులు పోల్చడం గమనార్హం. కరోనా రక్కసి అంటుకు లేకుండా చేసేందుకు చేపట్టిన జ్వర సర్వే కేసీఆర్ దీక్షాదక్షతలకు మరో ఉదాహరణ. కానీ, ఒక ప్రొఫార్మా అంటూ లేకుండా ఆదరాబాదరాగా, మొక్కుబడిగా కాంగ్రెస్ సర్కారు ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే వాటికి ఏ మాత్రం సాటిరాదు. సర్కారు చెప్పిన జనవరి గడువులోగా సర్వే పూర్తయి బీసీల లెక్కతేలుతుందా? లేక రిజర్వేషన్ల పెంపు లేకుండా ఎన్నికలను మమ అన్నట్టుగా నిర్వహించాలని చూస్తున్నదా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.

ఆహా... ఏమి కపటనీతి చతురత!

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పెద్దమనిషి అనే పేరున్నది. ఆయన రూపు, మాట తీరు, వైఖరి అన్నీ అందుకు అనుగుణంగానే ఉంటాయి. అందువల్లనే తనకు తమ పార్టీలో, ప్రతిపక్షాలలో కూడా గౌరవం ఉంది. కానీ, అధికారం మాటకు వచ్చేసరికి ఆయన ఇంత కపటంగా వ్యవహరిస్తారని గతంలో మనకు తెలియదు. ఊహించనైనా ఊహించలేదు. ఈ మాట ఎందుకు అనవలసి వస్తున్నది? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను తమ బడ్జెట్ల శక్తికి మించి ఇవ్వరాదని ఈ నెల ఒకటవ తేదీన ప్రకటించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆయన, అప్పటినుంచి నిండా వారం రోజులైనా ముగియకుండా ఆరవ తేదీ నాడు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఏకంగా ఏడు గ్యారెంటీల మ్యానిఫెస్టో ప్రకటించారు. దీన్నిబట్టి తన నీతి గురించి ఏమనాలో ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు.

టంకశాల అశోక్

ప్రస్తుతం ఝార్ఖండ్‌లో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ కూడా భాగస్వామిగా కల మహా గఠ్‌బంధన్ కూటమి. అక్కడ బడ్జెట్ పరిస్థితి ఏ విధంగా ఉందని వెతికితే, వారి ఆర్థిక మంత్రి రామేశ్వర్ ఒరాన్ గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన 2024-25 సంవత్సరపు బడ్జెట్ ప్రకారం ద్రవ్య లోటు జీఎస్‌డీపీలో 2.7 శాతం ఉండనున్నది. దానిని బట్టి చూసినప్పుడు, రుణాల తిరిగి చెల్లింపును మినహాయించి చూపుతున్న మొత్తం వ్యయం రూ.1,20,400 కోట్లలో వారు ఎన్నికల వ్యయభారాన్ని ఎంతమేర మోయగలరు? ఇప్పుడు ఖర్గేతో పాటు ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ కలిసి విడుదల చేసిన హామీల పత్రాన్ని ఒకసారి చూద్దాం.

> **ఆ ఏడు గ్యారెంటీలు ఈ విధంగా ఉన్నాయి. పేదలకు రూ.15 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఉచిత రేషన్‌ను నెలకు 5 కిలోల నుంచి 7కు పెంచటం, రూ.450కి వంటగ్యాస్ సిలిండర్, వరికి మద్దతు ధర క్వింటాలుకు ప్రస్తుత రూ.2,400 నుంచి రూ.3,200కు హెచ్చింపు, అటవీ ఉత్పత్తుల సేకరణ ధర 50 శాతం పెంచటం, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం ప్రస్తుత రూ.1,000 నుంచి రూ.2,500కు హెచ్చించటం. ఇవి నేరుగా నగదు ఖర్చుతో కూడుకున్నవి.**

ఇవి గాక భారీగా ఖర్చు కాగలవి యువతకు 10 లక్షల ఉద్యోగాలు, అన్ని జిల్లా కేంద్రాలలో ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీల ఏర్పాటుతో పాటు 500 ఎకరాలలో పారిశ్రామిక పార్కుల స్థాపన. ఏ ఖర్చు ఉండని, లేదా స్వల్పంగా మాత్రమే ఉండగల పరిపాలనాపరమైన హామీలు కొన్నున్నాయి గాని వాటిని పక్కన ఉంచుదాం.

ఈ గ్యారెంటీలన్నిటికి కలిపి సంవత్సరానికి కాగల ఖర్చెంత? ఆ భారాన్ని బడ్జెట్ మోయకో గలదా అనే లెక్కలు మహా గఠ్‌బంధన్ నాయకులు చెప్పలేదు. ఇతరత్రా ఎవరైనా అంచనాలు వేశారో లేదా తెలియదు గాని అది మనకు ప్రస్తుతానికి తెలియదు. యథాతథంగా గ్యారెంటీల వివరాలను చూసినప్పుడు మాత్రం, అదేవిధంగా పైన పేర్కొన్న బడ్జెట్ అంకెలు కొన్నింటితో పోల్చినప్పుడు, ఈ భారం చాలా పెద్దదేనని ఎవరైనా గ్రహించగలరు. అటువంటప్పుడు నవంబర్ 1న ఆ విధంగా హెచ్చరించి జాగ్రత్తలు చెప్పిన ఖర్గే, నవంబర్ 6న ఇటువంటి గ్యారెంటీలు ఏ విధంగా ప్రకటించారన్నది మనలను వేధించే ప్రశ్న. ప్రకటించినప్పుడు తను, సోరేన్‌తో పాటు కూటమిలోని ఆర్జేడీ, సీపీఐ (మార్క్సిస్టు- లెనినిస్టు) లిబరేషన్ నేతలు కూడా వేదికపై ఆసీనులై ఉన్నారు. ప్రకటనకు ముందు ఆయా అంశాలను వారంతా చర్చించే ఉంటారు. నవంబర్ 1 నాటి ఖర్గే వ్యాఖ్యలు కూడా అందరూ విని ఉంటారు.

అయినప్పటికీ ఇటువంటి అలవికాని హామీలను ఎందుకోసం ప్రకటించినట్లు? హామీలు కర్ణాటకలో 5, తెలంగాణలో 6, మహారాష్ట్రలో 5 కాగా, ఝార్ఖండ్‌లో 7కు పెరిగాయి. మహారాష్ట్ర ఎన్నికలు ఇంకా జరగలవలసి ఉండగా హిమాచల్‌ప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ హామీలతో అక్కడి ప్రభుత్వాలకు ఊపిరి సలపకుండా ఉన్నది. ఖర్గే ఆ విధంగా మాట్లాడటం అందువల్లనే గదా. అయినప్పటికీ ఝార్ఖండ్‌లో అట్లా ఎందుకు ప్రకటించినట్లంటే అందుకు సమాధానం ఎవరైనా చెప్పగలరు. చెప్పేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఇబ్బంది పడవచ్చు గానీ, అది అందరికీ తెలిసిన రహస్యమే. ఒక్క మాటలో - అధికారం. 28 రాష్ట్రాలు గల దేశంలో, 140 ఏండ్లు గల ఒక పార్టీ, కేవలం మూడింట పాలిస్తుండటం ఎంత అవమానకరం. ఝార్ఖండ్‌లో అధికారంలో ఉన్నా ఒక ప్రాంతీయ పార్టీకి జూనియర్‌గా మాత్రమే. కనుక మహారాష్ట్రలో గెలవటం, ఝార్ఖండ్‌లో అధికారం నిలబెట్టుకోవటం జీవన్మరణ సమస్య వంటిదైంది. హర్యానాలో అన్నీ అనుకూలంగా ఉండి గ్యారెంటీలు ఇచ్చినా ఓడటంతో ఒత్తిడి బాగా పెరిగిపోయింది.

అందువల్ల ఒకవిధంగా ఆలోచిస్తే మల్లికార్జున ఖర్గేను అర్థం చేసుకొని సానుభూతి చూపగలం తప్ప, విమర్శించాలంటే మనసు రావటం లేదు. ప్రస్తుత ఝార్ఖండ్‌లో పాలించటమైతే చేస్తున్నారు గాని గఠ్‌బంధన్ ఆధిక్యత బొటాబొటియే. మొత్తం అసెంబ్లీ సీట్లు 81లో వారికి 45. మెజారిటీ కేవలం 8. యాంటీ ఇన్‌కంబెన్సీ ఎప్పుడైనా కొంత ఉండటం వల్ల ఈ స్వల్ప ఆధిక్యత తేలికగా మారవచ్చు కూడా. కనుక అన్ని జాగ్రత్తలు తప్పనిసరి. ఒకవేళ ప్రస్తుతం చేతిలో లేని మహారాష్ట్ర అటు ఇటు అయినా, ఝార్ఖండ్‌లో ఉన్న అధికారాన్ని కోల్పోతే తలదించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితులలో, కూటమి భాగస్వాముల కన్న కాంగ్రెస్ భయం చాలా ఎక్కువ. ఏవో కొన్ని క్లిష్ట సమయాలలో అబద్ధం చెప్పవచ్చునని, అందువల్ల పాపం అంటదని పెద్దలు స్పష్టం చేశారు. ఆ జాబితాలో అధికారం లేదు గాని, దాన్ని ఇప్పుడు చేర్చుకోవటంలో పాపం ఉండదని ఖర్గే బహిరంగంగా ప్రకటించినా తప్పు పట్టలేం మనం.

> **వాస్తవానికి మహారాష్ట్ర, ఝార్ఖండ్ రెండూ సంపన్న రాష్ట్రాలు. మహారాష్ట్ర గురించి తెలిసిందే గనుక ప్రస్తుతం ఇక్కడ చర్చిస్తున్న ఝార్ఖండ్ విషయానికి వస్తే, ఆఫ్రికా ఏ విధంగానైతే మొత్తం ప్రపంచంలోనే సహజసిద్ధ వనరుల రీత్యా అత్యంత సంపన్నమైనదో, అదే కారణాల వల్ల భారతదేశంలో ఝార్ఖండ్ కూడా అటువంటిదే. అయినప్పటికీ రెండుచోట్లా ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. అందుకు కారణాలు బయటివారి దోపిడీ, స్థానిక ప్రభుత్వాలు, నాయకుల అసమర్థత, వారు సైతం దోపిడీలో భాగస్వాములు కావటమన్నది ఆర్థిక నిపుణుల ఏకాభిప్రాయం.**

ఆ మాట అందరూ అనుకునేదే కూడా. ఝార్ఖండ్‌లోని గిరిజనులకు, ప్రజలకు బ్రిటిష్ వలస పాలనకాలం నుంచి తిరుగుబాట్ల చరిత్ర ఉంది. అక్కడ బొగ్గు, యురేనియంపై రైట్ , అభ్రకం, రాగి తదితర విలువైన నిక్షేపాలతో పాటు అటవీ సంపద పుష్కలంగా ఉండి కూడా, ఈ రోజున నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం 42 శాతం మంది ప్రజలు పేదలే. సుమారు 33 శాతం మంది నిరక్షరాస్యులు. ఝార్ఖండ్ బీహార్‌లో భాగంగా ఉండినప్పుడు గాని, 2000లో వేరు పడినప్పటి నుంచి గాని అధిక సమయం కాంగ్రెస్ పార్టీ స్వయంగానో, ఇతరులతో పొత్తు కలిపో అక్కడ పాలించింది. అయినప్పటికీ ప్రజల దుస్థితి ఇదంటే, ఖర్గే గ్యారెంటీలకు ఎటువంటి విలువ ఇవ్వాలో ఆలోచించేందుకు కూడా మనమే సిగ్గుపడాలి. ఆయన పార్టీ మాత్రం ఎటువంటి సిగ్గులేకుండా, అలవికాని హామీలతో ప్రజలను దగా చేసేందుకు మరొకసారి సిద్ధమవుతున్నది. అది కూడా అటువంటి మితిమీరిన గ్యారెంటీలు తగదని ఖర్గే మహాశయులు నీతులు చెప్పిన 5 రోజులకే. ఇతర రాష్ట్రాలలోని గ్యారెంటీలకు అదనంగా మరొక 2 వడ్డించి మరీ. ఏమి కపటనీతి చతురత ఇది!

ఈ సందర్భంలో మరొకటి విచారించాలి. అభివృద్ధి ద్వారా ప్రజలను బాగు చేయాలి తప్ప అసలు సబ్సిడీలు, ఉచితాలు వద్దనే చర్చ ఆర్థిక సంస్కరణల కాలం నుంచి ఉండటం తెలిసిందే. రాయితీలు పేదలకు, అర్హులైన బడుగు వర్గాలకు మాత్రమే పరిమితం చేయాలనే మరొక వాదన కూడా ముందుకొచ్చింది. రాయితీల దురుపయోగంపైనా చర్చలున్నాయి. విషయానికి ఇది ఒక పార్శ్వం కాగా, తమ అసమర్థ పాలన, అవినీతి కారణంగా సక్రమమైన అభివృద్ధి ద్వారా ప్రజలకు మేలు చేయకుండా, అధికారం కోసం మాత్రం ప్రజలకు పార్టీలు ఎన్నికల సమయంలో పోటాపోటీగా అలవికాని హామీలు ఇవ్వటంతో ఆర్థికస్థితి గందరగోళంగా మారటం ఇటీవల ఎక్కువవుతున్నది.

ఉచితాలు తగదనే పార్టీలు సైతం గెలవటం కోసం అదే పని చేస్తున్నాయి. గెలుపు మీద నమ్మకం తగ్గే కొద్దీ హామీలు పెరుగుతున్నాయి. దీనంతటిలోని కపట క్రీడను గ్రహిస్తున్నప్పుడు ప్రజలు స్వయంగానే ఇదంతా వద్దనే కొత్త ధోరణి ఇప్పుడు మొదలవుతున్నది. కనుక ఇది అందరూ సీరియస్‌గా చర్చించవలసిన విషయం. పార్టీలన్నీ ఉమ్మడిగా సమావేశమై, ఇకనుంచి ఉచితాలు ఉండవనే తీర్మానం చేయగలిగితే ప్రజలకు, దేశానికి ఎంతో మేలు కలుగుతుంది.

చేయాల్సింది విధ్వంసం కాదు.. వికాసం

'ఒక నియంతకు మాత్రమే విజ్ఞప్తి చేసుకునే స్థితిలో ప్రజలు ఉంటే, వారిముందు రెండే మార్గాలు మిగులుతాయి. ఒకటి తిరగబడటం, రెండవది ఆ క్రౌర్యానికి మౌనంగా బలైపోవడం'... ప్రముఖ ఫిలాసఫర్ ఎంగెల్స్ చెప్పిన ఈ మాటలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 11 నెలల పాలనకు సరిగ్గా సరిపోతాయి. ఈ 11 నెలల కాలం తెలంగాణ ప్రజలకు పీడ దినాలేనని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిపై రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి చూస్తుంటే.. వందేండ్ల విధ్వంసానికి మార్గం వేస్తున్నట్టు కనిపిస్తున్నది.

దేవీప్రసాద్

కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు తెలంగాణ ప్రజలు స్వర్ణయుగాన్ని చూశారు. ప్రత్యేకించి, రైతులు రారాజులా జీవించారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేసేందుకు కేసీఆర్ అనేక వినూత్నమైన పథకాలను తీసుకొచ్చారు. రైతుబంధు, ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ, నిరంతర విద్యుత్తు, రైతు వేదికలు, మార్కెటింగ్ సదుపాయం కల్పించారు. తద్వారా ధాన్యం ఉత్పత్తి పెరిగి తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. వ్యవసాయం దండుగ అనే స్థితి నుంచి పండుగ అన్న స్థాయికి తీసుకువెళ్లడం కేసీఆర్ సాధించిన విజయం. కానీ, రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయి.

రేవంత్ పాలనలో రైతుభరోసా, రుణమాఫీ నుంచి మొదలుకొని ధాన్యం కొనుగోళ్ల వరకు రైతులకు మోసమే ఎదురైంది. సవాలక్ష నిబంధనలు పెట్టిన రేవంత్ సర్కార్ రూ.31 వేల కోట్ల రుణమాఫీని రూ.17 వేల కోట్లకే పరిమితం చేసింది. 40 లక్షలకు పైగా అర్హులైన రైతులుండగా.. 22 లక్షల మంది రైతులకే మాఫీ చేసి చేతులు దులుపుకొన్నది. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వడం లేదు. రూ.500 బోనస్ ఏమో గానీ కనీసం ఎంఎస్పీ కూడా దక్కడం లేదు. కాళేశ్వరంపై అక్కసుతో పంటలను ఎండబెట్టారు. కరెంటు కోతలతో మోటర్లు కాలిపోతున్నయి. వైండింగ్ దుకాణాలు కళకళలాడుతున్నాయి. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తామని చెప్పి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి బీఆర్ఎస్ పాలనను నిరంతరం రైతులకు గుర్తుచేస్తున్నారు.

100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500, పింఛన్ల పెంపు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం తదితర హామీల ఊసే లేదు. యువతకు ఇచ్చిన హామీల ఎగవేత నిరాటంకంగా కొనసాగుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన ఉద్యోగాలకే నియామక పత్రాలిచ్చి 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. గత డీఎస్సీకి కొన్ని పోస్టులు జతచేయడం తప్పితే కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. 2 లక్షల ఉద్యోగాల్లో 10 శాతం కూడా భర్తీ చేయలేదు. పైగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని నిరసన చేస్తున్న యువతపై లాఠీచార్జి చేయడం హేయం. యువతకు కొలువులు రాకపోగా.. కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ అప్పట్లో అశోక్‌నగర్ చుట్టూ తిరిగిన మేధావులకు మాత్రం పదవులు దక్కాయి. ఇప్పుడు వారు అటు దిక్కే చూడటం లేదు.

ఉద్యోగులది మరీ దారుణమైన పరిస్థితి. రాష్ట్ర చరిత్రలో తొలిసారి డీఏ ఇవ్వడానికి కమిటీ ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పెండింగ్ డీఏలు చెల్లిస్తామని వాగ్దానం చేసి, 11 నెలల తర్వాత ఒక డీఏ మాత్రమే ఇచ్చి సర్దుకోవాలని పాలకులు ప్రవచనాలు చెప్తున్నారు. ప్రతి నెల 1వ తేదీన కొందరికే జీతాలు చెల్లిస్తూ అందరికీ ఇస్తున్నామని దబాయిస్తున్నారు. 2024 మార్చి నుంచి ఇప్పటివరకు పదవీ విరమణ చేసిన 7 వేల మంది ఉద్యోగులకు రావలసిన రిటైర్‌మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి వారికి చేతులు రావడం లేదు. అంతేకాదు, 11 నెలలుగా పీఆర్సీ కమిటీ కాల పరిమితిని పొడిగిస్తూనే ఉన్నారు. ఓపీఎస్ అమలుచేస్తామన్న వాగ్దానం కూడా అటకెక్కింది. హెల్త్‌కార్డుల ఊసే లేదు. ప్రభుత్వం నియమించిన కోదండరామ్, చిన్నారెడ్డిలకు మొన్నటివరకు ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఇప్పుడు కేశవరావు రంగప్రవేశం చేశారు. దీంతో మళ్లీ పాత పాటే పాడాల్సి వస్తున్నది. అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర చిన్నస్థాయి ఉద్యోగుల వేతనాల పెంపు మాటే లేదు.

> **బీసీ రిజర్వేషన్లు అమలుచేయకుండా సర్వే పేరిట కాంగ్రెస్ సర్కార్ డ్రామా చేస్తున్నది. బడ్జెట్‌లో ఏటా బీసీల కోసం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి మాట తప్పిననాడే కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమైంది. అంతేకాదు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నది.**

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తున్నది. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తానంటూ ఆయన నెలకొల్పిన గురుకులాలను రేవంత్‌రెడ్డి విధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికే గురుకులాల్లో వివిధ కారణాల వల్ల 50 మందికి పైగా విద్యార్థులు తనువు చాలించారు. అయినా సర్కార్‌కు చీమ కుట్టినట్టు కూడా లేదు. గురుకుల వ్యవస్థను ఎత్తివేసి పేద పిల్లలకు విద్య అందకుండా చేయాలనే కుట్ర దీని వెనుక దాగి ఉన్నది. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ హైడ్రామా షురూ చేసింది. పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూలుస్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నది. తద్వారా ప్రజలను, పరిశ్రమ వర్గాలను భయభ్రాంతులకు గురిచేస్తూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నది. హైడ్రాపై వ్యతిరేకత వస్తుండటం, హైకోర్టు మొట్టికాయలు వేయడంతో మూసీ పునరుజ్జీవం పేరిట మళ్లీ కొత్త డ్రామా మొదలుపెట్టింది. బ్యూటిఫికేషన్ పేరిట పెద్ద ఎత్తున లూటిఫికేషన్‌కు కాంగ్రెస్ పాలకులు సిద్ధమవుతున్నారు.

> **మూసీ ప్రక్షాళనపై కాంగ్రెస్ సర్కార్‌కు ఒక ప్రణాళిక అంటూ లేనే లేదు. రూ.16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు వ్యయాన్ని కమీషన్ల కోసం ఏకంగా రూ.లక్షన్నర కోట్లకు పెంచేశారు. మూసీని పరిరక్షించేందుకు బీఆర్ఎస్ సర్కార్ గతంలో నడుం బిగించింది. అందుకు ముందుగా మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీల నిర్మాణాలను చేపట్టింది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం నీరుగారుస్తున్నది.**

రాష్ట్రంలో ప్రశ్నించేవారిపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. ఆరు గ్యారెంటీల అమలుకోసం గొంతెత్తుతున్న కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ నేతలపై దాడులే అందుకు నిదర్శనం. అంతేకాదు, సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న యువతపై కూడా దౌర్జన్యకాండ కొనసాగుతున్నది. అవినీతిని ప్రశ్నిస్తూ, ప్రజలను చైతన్యం చేస్తూ రాజీలేని రణం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌పై అక్రమ కేసులు పెట్టి, వారిని జైల్లో పెట్టాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. అయితే, లక్షలాది బైనాక్యులర్లతో వెతుకుతున్నా ఏమీ దొరకకపోవడంతో ఒత్తిడికి గురై ఆయన తిట్ల దండకం అందుకుంటున్నారు.

11 నెలల రేవంత్ పాలనలో కూల్చివేతలు తప్ప, నిర్మాణాలు జరగలేదు. సంక్షోభం తప్ప, సంక్షేమం లేదు. విధ్వంసం తప్ప, వికాసం లేదు. అంధకారం తప్ప, అభివృద్ధి కానరావడం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను తిడితే తాను గొప్పవాడినవుతానని ఆయన భావిస్తున్నట్టున్నారు. భారతదేశ పటంలో తెలంగాణను ఆవిష్కరించిన కేసీఆర్‌ను తిట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలిచ్చిన అద్భుతమైన అవకాశాన్ని అధికార మదంతో, అహంకారంతో రేవంత్ చేతులారా పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇలాగే మౌనంగా ఉంటే తెలంగాణ విధ్వంసానికి సాక్షులుగా మిలిగిపోతామని గ్రహించిన సబ్బండ వర్గాలు పోరాటాలకు సమాయత్తమవుతున్నారు.

(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)

> **కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన ఉద్యోగాలకే నియామక పత్రాలిచ్చి 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. గత డీఎస్సీకి కొన్ని పోస్టులు జతచేయడం తప్పితే కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. 2 లక్షల ఉద్యోగాల్లో 10 శాతం కూడా భర్తీ చేయలేదు. పైగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని నిరసన చేస్తున్న యువతపై లాఠీచార్జి చేయడం హేయం. యువతకు కొలువులు రాకపోగా.. కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ అప్పట్లో అశోక్‌నగర్ చుట్టూ తిరిగిన మేధావులకు మాత్రం పదవులు దక్కాయి. ఇప్పుడు వారు అటుదిక్కే చూడటం లేదు.**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించింది. ఈ మేరకు ప్రజల నుంచి 75 ప్రశ్నలకు సమాధానాలను రాబడుతున్నది. ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వీఏవోలు ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ, ఆ తర్వాతే అసలు సమస్య మొదలవుతున్నది. గతంలో రేవంత్ సర్కార్ నిర్వహించిన పలు సర్వేల డేటా ఎంట్రీ సమయంలో అనేక తప్పిదాలు చోటుచేసుకోవడమే అందుకు కారణం.

సర్వేలో అధికారుల నిలదీత

ఫిరోజ్ ఖాన్
96404 66464

ఆరు గ్యారెంటీల అమలు కోసం గతంలో 'ప్రజాపాలన' పేరిట రాష్ట్రవ్యాప్తంగా 1.25 కోట్లకు పైగా దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించింది. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రభుత్వ ఆపరేటర్లతో పాటు ప్రైవేటు ఆపరేటర్లను కూడా నియమించుకున్నది. పలుచోట్ల కార్యాలయాల్లో జాగ లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ప్రాంతాలను బట్టి ఒక్కో దరఖాస్తుకు రూ.10-15 వరకు ప్రభుత్వం వారికి చెల్లించింది. ఆపరేటర్ల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఆధార్, రేషన్‌కార్డుల నంబర్లు, గ్యాస్, కరెంట్ మీటర్ల వివరాల నమోదులో అనేక తప్పులు దొర్లాయి. దీంతో లక్షలాది కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాయి. ఎడిట్ ఆప్షన్ కూడా ఇవ్వకపోవడంతో ఫ్రీ కరెంట్, గ్యాస్ సబ్సిడీ ప్రయోజనాలు లక్షలాది కుటుంబాలకు దక్కలేదు. ఆ తర్వాత తప్పుల సవరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. అయితే, విచిత్రమేమంటే.. చాలా దరఖాస్తు లు మాయమయ్యాయి. మాయమైన దరఖాస్తులు రోడ్లు, చెత్తకుప్పల్లో కనిపించడంతో ప్రజలు ఆగ్రహం వ్య క్తం చేశారు. గోప్యంగా ఉంచాల్సిన తమ కుటుంబ వివరాలను రోడ్డుపాలు చేశారని ప్రభుత్వంపై మండిపడ్డా రు. ఈ నేపథ్యంలో తాజాగా జరుగుతున్న సమగ్ర సర్వే లో సేకరిస్తున్న వివరాలను కూడా అలాగే రోడ్డుపాలు చేస్తారా? అన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్నది.

ఇటీవల ప్రభుత్వం కోతలు, కొర్రీలతో రైతు రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. 40 లక్షల మందికి పైగా రైతులకు రుణాలుండగా.. సుమారు 22 లక్షల మంది రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇందుకు ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు, పేర్లు, కుటుంబ సభ్యుల వివరాలు, రుణాల వివరాలు తప్పుగా నమోదవడమే కారణం. అయితే, బ్యాంకర్లు సరైన వివరాలు పంపలేదని ప్రభుత్వం బుకాయిస్తున్నది. అంటే డేటా ఎంట్రీ తప్పుల కారణంగానే లక్షలాది మంది రైతులు రుణమాఫీ ప్రయోజనం పొందలేకపోయారన్నది వాస్తవం.

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేండ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా అకౌంట్ అకడమిక్ పర్మినెంట్ ఆటోమేటెడ్ రిజిస్ట్రీ (అపార్) పేరిట 12 అంకెలతో కూడిన కార్డు జారీ చేస్తారు. అయితే ఆధార్‌కార్డు, పాఠశాల రికార్డుల్లో పేర్ల నమోదులో తేడాలు ఉండటంతో అపార్ కార్డుల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి కూడా డేటా ఎంట్రీ తప్పిదాలే కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. డేటా ఎంట్రీలో జరుగుతున్న తప్పిదాల కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అందుకే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ప్రజలు ఆసక్తి చూపడం లేదు. మొదట కులగణన చేసేందుకే సర్వే చేపడుతున్నట్టు చెప్పిన ప్రభుత్వం తర్వాత వ్యక్తిగత విషయాలకు సంబంధించి 70 రకాల ప్రశ్నలను అడుగుతుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వస్తున్న అధికారులు, ఎన్యూమరేటర్లకు సమాధానాలు చెప్పకుండా వారినే తిరిగి ప్రశ్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో సందర్భంగా ఇచ్చిన హామీలనే ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చలేదని, వాటిని ఎప్పుడు నెరవేరుస్తారని అధికారులను నిలదీస్తున్నారు. పైగా ప్రజాపాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులకే అతీగతీ లేదంటే, మళ్లీ సర్వే ఏమిటని మండిపడుతున్నారని ఎన్యూమరేటర్లు వాపోవడం గమనార్హం. ఒక సర్వే విషయంలోనే కాదు, ప్రభుత్వం అవలంబించే విధానాల పట్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. నిన్నటికి నిన్న సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కలెక్టర్, మండలాధికారులు, వారి వాహనాలపైనా దాడులు జరిగాయి. కాబట్టి, ప్రభుత్వం ఇకనైనా ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. అంతేకానీ, నిరంకుశ, నియంతృత్వ పోకడలతో ముందుకువెళ్తామంటే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)